ప్రజాశక్తి
మంగళవారం 1 జులై 2025

చిన్నబగ్గ కొండల్లో ఏనుగులు తిష్ట

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలో చిన్నబగ్గ కొండల్లో గత ఐదు రోజులుగా ఏనుగులు తిష్ట వేశాయి. దీంతో చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. కొండపోడు సాగుకు వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ఏనుగుల ఘీంకారాలతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు ఏనుగుల సంచారం పట్ల గ్రామస్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తం చేస్తున్నారు.

జ్వరాల బారిన ఆశ్రమ పాఠశాల

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నా సరైన వైద్యం అందడంలేదని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 12 నుంచి ఆశ్రమ పాఠశాలలు పునః ప్రారంభమవ్వగా, వివిధ గిరిజన ప్రాంతాల నుంచి విద్యార్థిని, విద్యార్థులను తల్లిదండ్రులు వసతి గృహానికి తీసుకొచ్చిన కొద్ది రోజులకే తమ పిల్లలు జ్వరాలు బారిన పడ్డారని ఆందోళన చెందుతున్నారు. జ్వరం బారినపడ్డ విద్యార్థులను ప్రభుత్వాసుపత్రికి పాఠశాల సిబ్బంది తీసుకెళ్తున్నప్పటికీ సరైన వైద్య సేవలు అందడం లేదన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. మండలంలోని పెదఖేర్జల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు జ్వరాలు బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం వచ్చిన తర్వాత కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినప్పటికీ సరైన మందులు ఇవ్వడం లేదని, దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విషయం తెలుసుకున్న 'ప్రజాశక్తి' సోమవారం వసతి గృహాన్ని సందర్శించిన నేపథ్యంలో సుమారు ఐదు గురికి విద్యార్థులు మలేరియా పాజిటివ్‌తో ఇబ్బంది పడుతున్నా కనీసం వారికి సరైన మందులు ఇవ్వన్నట్టు తెలిసింది. ప్రభుత్వాసుపత్రిలో మలేరియా పరీక్ష చేయగా, పాజిటివ్ వచ్చిన వారికి సాధారణ పారాసెటమల్ ట్యాబ్లెట్లు ఇచ్చి పంపించడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆశ్రమం పాఠశాలకు చెందిన కె.శివాజీ, కె.హర్షవర్ధన్, హెచ్.దేవదాసు, పి.రాజేష్, సిహెచ్ రాహుల్, పి.కిరణ్‌కు మలేరియా పాజిటివ్‌గా తేలింది. అయితే తమకు మలేరియా నివారణా మందులు ఇవ్వలేదని విద్యార్థులు తెలిపారు. మలేరియా టెస్ట్ చేసి పాజిటివ్ వచ్చినా కనీసం ఓపి చీటీలో పాజిటివ్‌గా నమోదు చేయకపోవడం వైద్య సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. ఇలా గతంలో వైద్య సిబ్బందిని నిర్లక్ష్యంతో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు మృతి చెందుతున్న తీరు మారకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఐదు మందికి పైగా మలేరియా సోకినట్టు వారి ఒపి చీటీలో ఎక్కడా పాజిటివ్‌గా నమోదు చేయకపోవడం, వారికి అవసరమైన మలేరియా మందులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పాఠశాల సిబ్బంది తెలుపుతున్నారు. ఇప్పటికైనా వసతి గృహాల్లో గిరిజన విద్యార్థుల జ్వరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మలేరియా పాజిటివ్ వచ్చిన వారికి సరైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మలేరియాకు గురైన శివాజీ, మలేరియా నిర్ధారణ అయినా మందులు రాయని చీటీ

అనారోగ్యంతో ఆదర్శ పాఠశాల విద్యార్థి మృతి

కురుపాం : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి చదువుతున్న విద్యార్థి తోటపల్లి గణేష్ (16) అనారోగ్యంతో తన స్వగ్రామమైన రావాడలో ఇంటి వద్ద ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. తల్లిదండ్రులు అందించిన వివరాలు ప్రకారం ఆదివారం సాయంత్రం రక్తపు వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలో ఉండగా చినమేరంగిలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. గణేష్ కాలుకు దీర్ఘకాలికంగా ఇన్ఫెక్షన్ ఉందని తాజాగా రెండో కాలుకు కూడా వ్యాపించి శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆదివారం ఆకస్మికంగా రక్తపు వాంతులు జరిగాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల సమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా మార్చిలో పరీక్షలు రాయలేకపోయిన మేలో జరిగిన పరీక్షలకు హాజరై మొదటి సంవత్సరం ఉత్తీర్ణత సాదించినట్లు ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు గణేష్ ఇంటికి వెళ్లి సంతాపం వ్యక్తం చేసి శ్రద్ధాంజలి ఘటించారు. గణేష్ మృతితో రావాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

మాదక ద్రవ్యాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి -పార్వతీపురం

మాదక ద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తుమందులు కుటుంబాలను, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందన్నారు. అవగాహన అత్యావశ్యమన్నారు. ఆరోగ్యమే మహా భాగమని, దాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం అని ఆయన చెప్పారు. యోగా వంటి ఆరోగ్య అంశాల పట్ల ఆసక్తి కలిగి ప్రతి రోజు సాధన చేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా కుటుంబాలను నాశనం చేస్తుందన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభమయ్యాయని వాటి చుట్టు పక్కల ఎటువంటి విక్రయాలు, కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అటవీ, మారు మూల ప్రాంతంలో నాటుసారా తయారీ వంటి అంశాలను గమనించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల విక్రయాలు వివిధ రూపాల్లో ఉండే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. మాదక ద్రవ్యాలు, మత్తుమందుల ఉత్పాదకత, సరఫరా, రవాణా, విక్రయాలు, వినియోగం జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వీటికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 1972 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని ఆయన కోరారు. రవాణా వాహనాలను తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఎస్‌పి ఎస్ వి మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న చర్యలు వివరించారు. సమావేశంలో పాలకొండ డిఎస్‌పి ఎం.రాం బాబు, జిల్లా రవాణా అధికారి వి.దుర్గాప్రసాద్ రెడ్డి, ఎపిఎస్ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.సుమిత్ర, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశ షేక్, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వివివిఎస్ఎస్ బాబు, ఆర్‌పిఎఫ్ ఎస్సై ఎకె పాణిగ్రహి, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి, అధికారులు

గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న అర్హులైన ఎస్‌జిటి లకు, స్కూల్ అసిస్టెంట్లకు, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి తెలిపారు. ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించినట్టు తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో 19 మందికి ఉద్యోగోన్నతులు కల్పించామని, అందులో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 49 ఖాళీలకు 19 మందికి, ఎస్‌జిటి విభాగం నుండి పదోన్నతులు కల్పించినట్టు చెప్పారు. ఎస్ఎ తెలుగు -1, ఎస్ఎ ఇంగ్లీషు -3, ఎస్ఎ లెక్కలు -3, ఎస్ఎ ఫిజికల్ సైన్స్ -1, ఎస్ ఎ భౌతిక శాస్త్రం -3, ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు - 8 మంది ఉన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలనే కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, డిఆర్‌డిఎ పిడి సుధారాణితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం సాలూరు మండలం బంగారమ్మపేటకు చెందిన ఎ.సూర్యనారాయణకు, సీతానగరం మండలం ఇప్పలవలసకు చెందిన పి.కుమారస్వామికి చెవిటి మిషన్‌ను కలెక్టర్ అందజేశారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో 112 అర్జీలు అందాయి. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చూడాలి : ఎస్‌పి

పార్వతీపురంటౌన్ : తమకు జరిగిన అన్యాయానికి న్యాయం కోసం సామాన్య ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తారని, సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో విచారణ జరిపి, పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 11 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రోజుకు 20 నుంచి 50 రిజిస్ట్రేషన్ల వరకు జరుగుతున్నట్లు సమాచారం. నిబంధనలను తుంగలోకి తొక్కి అవసరమైన పత్రాలు లేనప్పటికీ రిజిస్ట్రేషన్లు ఇష్టానుసారంగా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవనాలు ఉన్న దగ్గర ఖాళీ స్థలాలు ఉన్నట్లు చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తుండగా, స్థలం ఒక చోట ఉంటే వేరే ప్రాంతం నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుంది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఇదంతా సంబంధిత అధికారులకు చేతులు తడిపితే చకచకా పని అయిపోతోందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. అడిగిన వారు లేకపోవడంతో సంబంధిత అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. కనీసం భౌగోళిక పరిస్థితిని కూడా గుర్తించకుండా బేరసారాలు కుదుర్చుకొని రిజిస్ట్రేషన్లు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడున్న అధికారులు, సిబ్బంది కాసులు కూడగట్టుకోవడానికి ఇలా ప్రభుత్వ ఖాజనాకు గండికొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల 469 సర్వే నెంబరులో రిజిస్ట్రేషన్ చేసి తర్వాత సవరణ పేరుతో 470/1లోకి మార్చిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అలాగే డి- పట్టా భూములను కూడా రిజిస్ట్రేషన్ చేస్తూ నిబంధనలకు పాతర వేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రర్ డాక్యుమెంట్ లేని స్థలాలకు తహశీల్దార్ పొజిషన్ సర్టిఫికేట్‌తోనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్న కొంత మందికి పొజిషన్ సర్టిఫికెట్లు లేకుండానే రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది.

నకిలీ పొజిషన్ సర్టిఫికేట్లతో

పాలకొండలో కొంత కాలంలో నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు జోరుగా కనిపిస్తున్నాయి. పాలకొండ నగర పంచాయతీ పరిధిలో గ్రామ కంఠాలకు తహశీల్దార్ పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంది. అయితే కొంత మంది ప్రైవేటు వ్యక్తులు రుణాల కోసం నకిలీ సర్టిఫికెట్లు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది అప్పటి డిప్యూటీ తహశీల్దార్ పేరుతో నకిలీ పొజిషన్ సర్టిఫికేట్ సృష్టించగా రెండు నెలల క్రితం ఒక విఆర్ఒ పేరుతో నకిలీ పొజిషన్ సర్టిఫికేట్ సృష్టించినట్లు బయటకొచ్చింది. ఇవేకాక మరికొన్ని నకిలీ సర్టిఫికెట్లు చలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాల్సి రెవెన్యూ యంత్రాంగం ఉదాసీనత చూపించడంతో వారిపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి.

నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లతోనే..

పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సంతకాలు ఫోర్జరీ చేస్తే క్రిమినల్ కేసు

ఈ విషయమై 'ప్రజాశక్తి' ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎంఎస్‌వి ప్రసాద్‌ను వివరణ కోరగా తమ దృష్టికి ఏమీ రాలేదని, ఒకవేళ ఎవరైనా సంతకాలు ఫోర్జరీ చేస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అలాగే సబ్ రిజిస్ట్రర్ శ్రీనివాసులును పొజిషన్ సర్టిఫికెట్లు లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నారా అని 'ప్రజాశక్తి' వివరణ కోరగా, సమాధానం దాట వేశారు. భవనాలుంటే ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అడగ్గా దానికి కూడా సమాధానం దాటవేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

9న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జూలై 9న జరుగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మన్మధరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను తీసుకొస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో 10 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. కార్మికులకు నష్టదాయకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, తదితర డిమాండ్ల సాధనకై జూలై 9న జరుగు జాతీయసమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు నిమ్మక రైవరమ్మ, ఉష, రజిని, కురమమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జిసిసి సేల్స్‌మేన్ మృతి

సీతంపేట : సీతంపేటకు చెందిన కొండ గొర్రె లక్ష్మణరావు (57) సోమవారం శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంతూ మృతి చెందారు. కిడ్నీ సమస్య వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మండలంలోని గోయిది జిసిసి డిఆర్ డిపోలో సేల్స్ మెన్ గా ఉద్యోగం నిర్వర్తిస్తున్నారు .

విద్యుత్ బిల్లుల సమస్యపై నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

ఉచిత విద్యుత్తు అని ఐదేళ్లు బిల్లు అడగలేదని, ఇప్పుడు అదంతా చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామనడం దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ శాఖ ఎఇ కార్యాలయం వద్ద మండలంలోని సింగన్నవలస పంచాయతీ మల్లంగూడ గిరిజన కుటుంబాలతో కలిసి నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇచ్చిన ఐదేళ్లు కరెంటు మొత్తానికి బకాయిల పేరుతో కిరాతకంగా రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుందన్నారు. మల్లంగూడ గిరిజన కుటుంబాలకు 200 యూనిట్ల లోపు అందరూ కరెంటు వినియోగిస్తున్నప్పటికీ ట్రూ అప్, సర్వీస్ ఛార్జీలు తదితర పేర్లతో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు గడిచిన కాలాన్ని లెక్కలు కట్టి ఇప్పుడు అధిక మొత్తంలో బిల్లు చెల్లించమనడం అన్యాయమన్నారు. ఇందులో భాగంఠ సవర మజ్జియ్యకు రూ.18,863, సవర చిన్నకు రూ.10,889, సవర సుక్కమ్మకు రూ.8,152 ఇలా గ్రామస్తులందరికీ వేలల్లో బిల్లులు వచ్చాయన్నారు. ఈ బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఉచిత విద్యుత్తు కొనసాగింపు చర్యలు తీసుకోవాలని, 200 యూనిట్లు లోపు కరెంటు వినియోగించే వారికి వివిధ రూపాల్లో ఇచ్చిన బకాయిని రద్దు చేయాలని, విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఇ శ్యామ్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో మల్లంగూడ గిరిజన సంఘం నాయకులు ఎ.భానుచందర్, ఎస్.మజ్జియ్య, ఎస్.చిన్నారావు, వి.చెంప, సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, ఎ.లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎఇ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

సమస్యల పరిష్కారానికి 10 నుంచి సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నల్లబ్యాడీలతో నిరసన, జులై 10న సమ్మె చేపట్టనున్నట్టు ఎపిఎస్ ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్ల సంఘం తెలిపింది. ఈ మేరకు సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ ఎపిఎస్ఆర్టీసీ అద్దె బస్ డ్రైవర్లు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి కలెక్టర్‌కు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్సు యజమానులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ జూలై 1నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై దశల వారీ నిరసన చేపడతామన్నారు. వినతిని అందజేసిన వారిలో ఎపిఎస్ఆర్‌టిసి హైయర్ బస్సు డ్రైవర్లు, కాంట్రాక్టువర్కర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) యూనియన్ అధ్యక్షులు కెవి చారి, సెక్రటరీ పిడి ప్రసాద్, కోశాధికారి ఎస్.మన్మధరావు, కోశాధికారి సి. అశోక్, నాయకులు డి. అఖిల్, పి.కృష్ణ, పి.మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అద్దెబస్సు డ్రైవర్లు

కలెక్టర్‌కు, అసిస్టెర్ లేబర్ కమిషనర్‌కు అందజేసిన వినతిని చూపుతున్న నాయకులు

ఎస్‌టి హాస్టళ్లలో అదనంగా భవనాలు నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో గల గిరిజన వసతిగృహాల్లో అదనపు భవనాలు నిర్మించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబికకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూపార్వతీపురం కేంద్రంలో ఎస్టీ కాలేజీ హాస్టళ్లలో అదనంగా భవనాలు నిర్మించాలని కోరారు. ఎస్‌సి, బిసి కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఏర్పడి మూడేళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. అదనంగా కాలేజీ హాస్టల్ భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా నలుమూలం నుంచి వచ్చిన విద్యార్థులు చదువుకోవడానికి మౌలిక వసతుల్లేక విద్యకు దూరమవుతున్నారని, వసతి గృహాలున్నా సరిపడా గదుల్లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కావున అదనంగా వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో గల కాలేజీలో వసతులు బాగోలేక, పడక గదులు చాలక విద్యార్థులు వచ్చిన దారే తిరిగి వెళ్లిపోతున్నారని చెప్పారు. భవిష్యత్తులో విద్యార్థులంతా విద్యకు దూరమవుతారని, మన్యం జిల్లాలో పేరుకే రెండు ఐటిడిఎలు ఉన్నాయని, గిరిజన విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కాని ఎడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం కె. డేవిడ్, జిల్లా కమిటీ సభ్యులు జి.సురేష్ కె.రాజేష్ పాల్గొన్నారు.

జెసికి వినతిని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సాగు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చినగోర కాలనీ రెవెన్యూ పరిధిలో సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సీతారాం మాట్లాడుతూ లక్ష్మీదేవి కొండ, రాళ్లగడ్డ పక్కన సుమారు 2 దశాబ్దాల నుంచి 30 గిరిజన కుటుంబాలు 60 ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, సంత నర్సిపురానికి చెందిన కొంతమంది వ్యక్తులు గిరిజనులు సాగు చేస్తున్న భూమి వద్దకు వచ్చి ఇవి తమ భూములని దౌర్జన్యం చేసి గిరిజనులను కొట్టారని ఆయన అన్నారు. ఏళ్ల తరబడి గిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు ఎ.సాయి కామేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి రాజు, మండల కార్యదర్శి బి.మోహన్‌రావు, చీమల గౌరయ్య, ఎల్‌ఆర్, టర్బన్, రామారావు, ఎన్ ప్రసాదరావు, తదితర గిరిజనులు ఉన్నారు

తహశీల్దార్ కార్యాలయం వద్దధర్నా చేస్తున్న గిరిజనులు

కోడుబంద ఆక్రమణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎస్ఆర్‌పురం పంచాయతీ పరిధిలో సింగానదారవలస రెవెన్యూ పరిధిలో ఉన్న కోడు బంద ఆక్రమణకు గురైందని ఆయికట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబర, కవిరిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు బంధను పూర్తిగా ఆక్రమించుకొని పల్లం పంటలుగా సాగు చేసుకుంటున్నారని, మరొకరు పూర్తిగా తోటలు వేసుకుని సాగు చేసుకుంటున్నారని ఆయ కట్ట రైతులు ఆరోపిస్తున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి కోడిబంద విస్తీర్ణాన్ని గుర్తించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నిటిలో విద్యార్థుల నమోదును పెంచాలని మండల విద్యాశాఖ అధికారి 1 సామల సింహాచలం అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎన్రోల్మెంట్ స్పెషల్ డ్రైవ్‌పై ప్రత్యేకంగా సిఆర్‌ఎంటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదును శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకటి, ఆరు తరగతుల నమోదు శత శాతం పూర్తి చేయాలని సూచించారు. మండలంలో డ్రాప్ అవుట్స్ లేకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సిఆర్‌ఎంటిలు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, స్టూడెంట్ కిట్స్ పంపిణీ, పాఠశాలల స్థితిగతులపై నివేదిక సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఇఒ2 కొండలరావు, సిఆర్‌ఎంటిలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సమస్యలులేవా... ? అధికారులు లేరా..?

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యాలయ ఎఒ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపిఒ జి.సత్యంనాయుడు మినహా మిగిలిన శాఖల అధికారులు ఎవరూ మధ్యాహ్నం 12 గంటలైనా హాజరు కాలేదు. దీంతో అధికారులకు వేసిన కుర్చీలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో ఫిర్యాదుదారులు కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్ల ఆసక్తి చూపడం లేదన్న చర్చ జరిగింది. ప్రతి సోమవారం ఇదే పరిస్థితి.

బోల్తాపడిన లారీ

గోతులను తప్పించబోయి లారీ బోల్తా

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను తప్పించబోయి వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. సోమవారం వేకు జామున పార్వతీపురం నుంచి కూనేరు వైపు కర్రల లోడ్‌తో వెళ్తున్న లారీ కొమరాడ బాలురు గురుకుల కళాశాల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మలుపు వద్ద ఉన్న గోతును తప్పించిపోయి అదుపుతప్పి లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఏది ఏమైనా అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారవడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. గతంలో రాయగడ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేకమార్లు రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పి కొంతమేరకు ప్రమాదాలను నివారించినప్పటికీ కనీసం ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం గానీ అధికారులు కానీ గోతులు కప్పేందుకు ముందుకు రాకపోవడంతో ఇలా ఇంకెన్ని ప్రమాదాలు జరుగుతాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేకంగా స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న రాహుల్ కుర్నా

డిఎ జుగాను సందర్శించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వబ్బంగి పంచాయతీలో గల కాకిలిలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన డిఎ జుగా కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు రాహుల్ కుర్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ పథకం ముఖ్యోద్దేశం గూర్చి గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న జాతపు, సవర, గదభ ప్రజలకు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసి వందకు వందశాతం వృద్ధి సాధించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమం వివిధ శాఖల అధికారులు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపించింది... రోడ్డు పగిలింది

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజాధనాన్ని కాపాడాల్సిన అధికారులు గుత్తేదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడడంతో పది కాలాల పాటు ఉండాల్సిన నిర్మాణాలు పది రోజుల్లో పాడైపోతున్నాయి. పనులు జరిగిన సమయంలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారుల తను ఇష్టానుసారంగా పనులు చేపడుతుండడంతో అవి మూడునాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. దీంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. ఇందుకు నిదర్శనం మండలంలోని సిఎస్‌పి రోడ్డు పనులే.

మండలంలోని సీఎస్పీ రహదారి నుంచి చిదిమి గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్ల 200 మీటర్ల దూరంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.కోటీ 20 లక్షలతో సీతంపేట ఐటిడిఎ ఇంజినీరింగ్ పర్యవేక్షణలో ఈ ఏడాది మార్చిలో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పనులు చేపట్టినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడంతో గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. దీంతో పన్నుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో ఈ రోడ్డును చూస్తే అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత శతాబ్ద కాలంగా చిదిమి గ్రామ రహదారి రాలు తేలి ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థులు మరిన్ని అవస్థలకు గురయ్యేవారు. అంతేకాకుండా తరచుగా వాహనాలు కూడా మరమ్మతులకు గురయ్యేవి. ఈ కారణంతో పలువురు అనారోగ్యం పాలవడంతో పాటు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామానికి బిటి రహదారి నిర్మాణ పనులు జరగడంతో గ్రామస్తులు ఎంతో సంతోషించారు. తీరా పన్నుల్లో నాణ్యత లోపించడంతో రోడ్డు పగిలి మళ్లీ మొదటి స్థితికి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని గుత్తేదారుపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పగిలిపోయిన రోడ్డు

రాళ్లు తేలిన కాకిలి -సాకి రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో ?

కురుపాం: సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయాలనే కూటమి ప్రభుత్వం ఆశయానికి గత పాలన చర్యలు గండి కొడుతున్నాయి. ఫలితంగా సంక్రాంతి ముగిసి ఐదు నెలలు అవుతున్నా నేటికీ ఈ రోడ్లకు మోక్షం లేకుండా పోయింది. మండలంలోని వబ్బంగి పంచాయతీలో గల కాకిలి నుండి సాకి గ్రామానికి వెళ్లే రోడ్డు సుమారు 5 కిలోమీటర్లు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్డు ఏర్పాలు చేస్తామని ఇచ్చిన మాటలు బుట్ట దాఖలు అయ్యాయి. దీంతో ఆ రోడ్లపై ద్విచక్రవాహన దారులు, పాదచారులు ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నారు. రాళ్లు తేలిన రోడ్లపై ప్రయాణం తరచూ ప్రమాదాలకు దారితీస్తోంది. గత కొన్ని ఏళ్లుగా అడుగడుగున గుంతలతో ఈ రోడ్డు మరీ దారుణంగా మారింది. కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో మరమ్మతులకు గురైన రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరసన తెలుపుతున్న సాంబ, తదితరులు

రోడ్డు మరమ్మతు పనులు చేయాలని నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను మరమ్మతులు చేపట్టాలని సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వర్షంలో వినూత్నంగా ప్లాస్టిక్ గొడుగులు వేసుకుని సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కోటిపాము వంతెన మధ్య ఏర్పడిన గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 8వ తేదీ లోపు గాని పార్వతీపురం నుండి కూనేరు మీదుగా వెళ్లే అంతరాష్ట్ర రహదారి మార్గంలో గోతులు పూడ్చకపోతే పెద్ద ఎత్తున కోటిపాము బ్రిడ్జి వద్ద ఆందోళన చేపడుతాం అని హెచ్చరించారు. పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాల కెళ్ళి రహదారి మార్గంలో కుమ్మరకుంట రైల్వే గేట్ సమీపంలోనూ, జంఝాతి సెంటర్లోనూ, కోటిపాం బ్రిడ్జి మీద, కోటిపాము జడ్పీ హైస్కూల్ వద్ద, ఇందిరా నగరం వద్ద, చోళ పదం దేవాలయం వద్ద, అటు ఒరిస్సా ఇటు ఆంధ్ర సరిహద్దు కూనేరు గ్రామం వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రతిరోజు వాహనదారులు ఈ గోతుల్లో వర్షపు నీరు ఉండటం వల్ల పడిపోయి అనేక ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయంపైన అనేకసార్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ రోడ్లు భవనాల శాఖ అధికారులు తమ దగ్గర పైస లేదంటూ సమాధానం తప్ప ఎక్కడ పూర్తిస్థాయిలో ఈ గోతులు కప్పే పరిస్థితి లేదని అన్నారు. గతంలో అనేక విధాలుగా ఆందోళన చేసిన నేపథ్యంలో సంక్రాంతి ముందు పెద్ద పెద్ద గోతులు కప్పారు తప్ప చిన్నచిన్న గోతులు వదిలేయడం వల్ల ఈరోజు మళ్లీ మొదటకి ఈ గోతులు పరిస్థితి వచ్చాయన్నారు. వెంటనే ఈ గోతులన్నీ కప్పేసి అటు వాహనదారులు ఇటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

'దారి తప్పతున్న కూటమి ప్రభుత్వం'

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి కూటమి ఏడాది పాలన "కార్పొరేట్లకు వరాలు – ప్రజలపై భారాలు" గా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం 'దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తలకిందులుగా ఉందన్నారు. ప్రజలకు హామీలు, వాగ్దానాలు, మాటలే మిగిలాయని, కార్పొరేట్లకు కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారని, వారి పనులు వేగమవుతున్నాయని వారు విమర్శించారు. సూపర్ –6తో సహా హామీలు వైఫల్యం, విద్యుత్తు, పన్నుల భారాలు, గిట్టుబాటు ధర లేకపోవడం కనీస వేతనాలు అమలు కాకపోవడం, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని వారు అన్నారు. జిల్లాలో ఎన్నికల సందర్భంలో ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని, జీడికి గిట్టుబాటు ధర ఇచ్చి బోర్డు ఏర్పాటు చేస్తామన్న వాగ్దానం అమలు జరగలేదని, తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ నిధులు కేటాయించి ఆయకట్టు రైతులకు సాగునీరందిస్తామన్నారు, జంపర్ కోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామని,పాలకొండలో రైతు బజార్, గిరిజన ఉత్పత్తులతో చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పిస్తామని తదితర సమస్యలు పరిష్కారం నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధమ స్థానంలో ఉన్న ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడంలో ప్రథమ స్థానంలో ఉందని వారు విమర్శించారు.

ఏడాది పాలనపై పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లతో సామాన్యులకు లక్షల్లో బిల్లులు వస్తున్నాయని, ఈ ఏడాదిలో విద్యుత్ ఛార్జీల ద్వారా రూ.15,485 కోట్లు భారాన్ని వేసిందని విమర్శించారు. నగరాల్లో ఇల్లు, షాపులు, ఖాళీ స్థలాలకు విలువ ఆధారిత ఆస్తి పన్ను భారీగా పెంచారని విమర్శించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పడంతో పాటు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. టిడిపి కూటమి ఇచ్చిన వాగ్దానాలను ఇకనైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకొండ నగర పంచాయతీకి డంపింగ్ యార్డ్, తాగునీరు, శివారు గ్రామాలకు మౌలిక సదుపాయాలు, రోడ్డు విస్తరణ, బైపాస్ రోడ్డు ఏర్పాటు, మినీ స్టేడియం, పాలిటెక్నికల్ కాలేజీ ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు అర్థముడి లక్ష్మణరావు, కాదా రాము, దూసి దుర్గారావు, ఎ.భానుసుందర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎస్.మజ్జియ్య, ఎస్.చిన్నారావు, రమేష్, జోషి, తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - వీరఘట్టం

సూపర్ సిక్స్‌తో పాటు పీపుల్ సిక్స్ అమలు చేయాలని కోరుతూ సోమవారం సిపిఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ప్రధాన రహదారి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నుండి వందరోజుల పని దినాలను 200 రోజులకు పెంచాలని, వేతనం రూ.650 ఇవ్వాలని, గిరిజన గ్రామాల్లో విద్య, వైద్య, రహదారి, తాగు నీటి, సౌకర్యాలు కల్పించాలని, గోరలో 40 సంవత్సరాలు నుండి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజ నేతరులను తొలగించి ఆ పంచాయతీలో ఉన్న భూములకు 1/71 చట్టం ప్రకారం గిరిజన ఆదివాసులకు వర్తింప చేయాలని, వీరఘట్టం మండలంలో పట్టాలు తారుమారు చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు

బహుభాషా ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

బహుభాషా ఉపాధ్యాయులు, సవర భాష విద్య వాలంటీర్లను రెన్యువల్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సవర ఆనందరావు, కోశాధికారి ఎల్లంగో, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సవర డోంబు తదితరులు ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డికి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సవర భాష విద్యా వాలంటీర్లు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమై 18 రోజులు కావస్తున్నా ఇంకా రెన్యువల్ చేయలేదన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగా పనిచేసినా రూ.5వేలు వేతనం ఇస్తున్నారని అది కనీసం ఛార్జీలకే సరిపోదని వేతనం పెంచాలని పిఒకి విన్నవించారు. కోడూరుకు చెందిన నేరవేణి చొర్లంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ పోస్టు ఇప్పించాలని విన్నవించారు. బొండిగూడకు చెందిన వెంకట్రావు పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. కారం కొత్తగూడకు చెందిన మల్లమ్మతల్లికి వందనం ఇప్పించాలని, సీతంపేటకు చెందిన పాలక రవణమ్మ దశలవారిగా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి అవకాశం కల్పించాలని కోరారు. గ్రీవెన్స్‌లో 72 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవిఎస్ఎన్‌కుమార్, ఎఒ వాహిని, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పిఒకు వినతినిస్తున్న నాయకులు

సిపిఒ సేవలు మరువలేనివి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ప్రణాళిక అధికారి వీర్రాజు సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. జిల్లా ప్రణాళిక అధికారి వీర్రాజు ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ వీర్రాజు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వీర్రాజు మంచి సేవాతత్పరతతో వృత్తిని నిర్వహించారన్నారు. అంకితభావంతో సేవలు అందించడం వల్ల మన్ననలు పొందగలరని పేర్కొన్నారు. సీనియర్ల సేవలను జూనియర్లు గుర్తించి వారిని మార్గదర్శకంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. సిపిఒ వీర్రాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వృత్తిలో సంతృప్తిని పొందానన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు సహకరించిన కలెక్టర్, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసిన వ్యక్తి సింహాచలం

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఇంజనీర్ ఎస్.సింహాచలం ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించి మిగిలిన సిబ్బందికి స్ఫూరిగా నిలిచారని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిఇ సింహాచలం ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం స్థానిక వైటిసిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం దంపతులను ఘనంగా పిఒ సత్కరించారు. అనంతరం పిఒ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ ముందు రోజు వరకూ పనిచేస్తూనే ఉన్నారని అన్నారు. ఆయన స్ఫూర్తితో యువ ఇంజనీర్లు ముందుకు వెళ్లాలని కొనియాడారు. ఎపిఒ చినబాబు మాట్లాడుతూ పనిపై ఎక్కువ బాధ్యతగా తీసుకుంటారని, దీంతో మనకు పురోగతి కనిపిస్తుందని అన్నారు. ఏజెన్సీలో అనేక సేవలు అందించారని కొనియడారు. డిడి అన్నదొర మాట్లాడుతూ ఏజెన్సీలో అధికంగా పనిచేశారని పనులు కూడా మంచిగా ఉన్నాయన్నారు. ఇఇ కెవి ఎస్ ఎన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి పని చేస్తానన్న వ్యక్తి ఒక సింహాచలమని, తమ కార్యాలయంలో సింహం అని పిలుస్తామని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.సత్యం, డిఇ సిమ్మన్న, ఎఇ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: హరిప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

నేటి ఉపాధ్యాయులకు ఆదర్శం హరిప్రసాద్

మక్కువ: నేటి తరం ఉపాధ్యాయులకు తెలుగు పండిట్ బొత్స హరిప్రసాద్ ఆదర్శమని భాషా సంఘం అధ్యక్షులు గోవిందంనాయుడు అన్నారు. తెలుగు పండిట్‌గా దీర్ఘకాలం పనిచేసే ఉద్యోగ విరమణ చేసిన బొత్స హరిప్రసాద్ ఉపాధ్యాయ వృత్తిపై పలువురు ప్రశంసలు కురిపించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువుగా, తెలుగుదనం అచ్చు గుద్దేలా ఆయన వ్యవహార శైలి, భాష, అలంకరణ వంటి విషయాలలో ఆ రీతిగా మెలిగే వారని తెలుగు మాస్టర్ హరి ప్రసాద్‌ను అంతా ప్రశంసించారు. ఆధ్యాత్మిక చింతనలో తత్వ బోధనలో ఆయనకు ఆయనే సాటి అన్న రీతిలో ప్రస్థానం కొనసాగిస్తున్నారని అన్నారు. 398 రూపాయల జీతంతో ఉపాధ్యాయ వృత్తిలో చేరారని, నేటితరం ఉపాధ్యాయులకు, తెలుగు భాషా పండిత్‌లకు ఆదర్శప్రాయంగా నిలిచారని వక్తలు ప్రశంసించారు.

పార్వతీపురం టౌన్: ఉద్యోగ విరమణ అనేది వృత్తికే గాని శరీరానికి కాదని రిటైర్మెంట్ అనంతరం కూడా శేష జీవితం ఆరోగ్యంగా, ఆనందమైన జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పి ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఉద్యోగ విరమణ చేయనున్న పోలీసు అధికారులకు, సిబ్బందిని ఉద్దేశించి అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ, స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఉద్యోగులకు ఆయన సన్మానం చేసి ప్రత్యేక జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఆత్మీయ వీడ్కోలు పలికి, జిల్లా కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున జ్ఞాపికను, చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ శాఖలో అంకితభావంతో మంచి సేవలు అందించారని, సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించారని,. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఎక్కడ రాజీ పడకుండా ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, డిసిఆర్బి సిఐ ఆదాం పాల్గొన్నారు.

9,697 మందికి పింఛన్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో వితంతు, వృద్ధాప్య, వంటరి మహిళా, డప్పు, చేనేత, మత్స్యకార, కల్లుగీత, చర్మ కారులు, తదితర రకాలైన 9697 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ సోమవారం తెలిపారు. 170 మంది పింఛన్ల పంపిణీ అధికారులు జులై 1నుంచి లబ్ధిదారుని ఇంటికి వచ్చి పింఛను ఇస్తారన్నారు.

ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, సాలూరు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించే ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి గుమ్మడి సంధ్యా రాణిని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో సోమవారం మంత్రిని కలిశారు. వెంగళ రాయ సాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టుల నుంచి శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అజ్జాడలో ఆలయ భూముల సమస్య పరిష్కరించాలి

బలిజిపేట మండలం అజ్జాడలో ఉన్న శ్రీవేణుగోపాల స్వామి ఆలయ భూముల సమస్యను పరిష్కరించాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యతలో డొల్లతనం.. నాసిరకానికి నిదర్శనం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అనేక భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించింది. కానీ మండలంలోని పలు అభివృద్ధి పనులు అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల నాణ్యతలో డొల్లతనం కనిపిసోంది. దీంతో మండలంలో పలు అభివృద్ధి పనులు నాసిరకానిక నిదర్శనంగా కనిపిస్తున్నాయి.

మండల కేంద్రంలో కెజిబివి పాఠశాలలో జరుగుతున్న అదనపు భవన నిర్మాణ పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు డార్మెంటరీ, క్లాస్ రూమ్ సౌకర్యం కల్పించేందుకు సర్వశిక్ష అభియాన్ నిధులతో ప్రత్యేక భవనం మంజూరు చేశారు. గత నెల రోజులుగా ఈ భవనం పనులు వేగవంతంగా జరుగుతున్నప్పటికీ నాసిరకంగా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై విలేకరుల బృందం ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలించగా నాణ్యత డొల్లతనం స్పష్టంగా కనిపించింది. రెండు అంతస్తుల భవన నిర్మాణం కోసం ప్రస్తుతం చేస్తున్న భూములో వేసిన పిల్లర్ల పనుల్లో కూడా నాణ్యత లేదని తెలిస్తోంది. సిమెంట్ పనుల్లో ఇసుక ఎక్కువ సిమెంట్ తక్కువగా చేసి తూతూ మాత్రంగా పనులు చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా సిమెంటు, ఇనుము వాడాల్సి ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా నాసిరకం మెటీరియల్ వాడుతున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ భవనాలకు వాడవలసిన నాగార్జున తదితర రకాల సిమెంట్ వాడకుండా తక్కువ రకానికి చెందిన ఒడిస్సా రాష్ట్రం నుంచి తెప్పించిన సిమెంట్‌ను వాడుతున్నట్లు స్థానికులు గుర్తించారు. గతంలోన ఈ సిమెంట్ మంచిది కాదని పాఠశాల ప్రత్యేక అధికారి అరుణ్ కుమారి అనేకమార్లు ఇంజనీరింగ్ అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా వాడుతున్నారని ఆమె స్వయంగా చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయంపై అక్కడ ఉన్న కాంట్రాక్టర్‌కి సంబంధించిన సూపర్‌వైజర్ వద్ద ప్రస్తావించగా ఆ సిమెంట్ బొబ్బిలి డీలర్ దగ్గర నుంచి తెచ్చామని ఆ సిమెంట్ వాడాలని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారని చెప్పడం మరింత విడ్డూరం. ఈ విషయంపై సర్వ శిక్ష అభియాన్ జెఇ వద్ద ప్రస్తావించగా ఆ సిమెంట్ 53 గ్రేడ్ ఉందని ఆ సిమెంట్ వాడొచ్చని ఆయన కూడా చెప్పడం కొసమెరుపు. ఏది ఏమైనా పనులు జరుగుతున్న ప్రదేశంలో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఇలా నాణ్యతలేని పనులు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యత నియమాలు పాటించి నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కోరుతున్నారు.



నాసిరకం సిమెంట్ బస్తా

నాసిరకం సిమెంట్, ఇసుక కలిపిన ఉంచిన నిర్వాహకులు

ఉత్తరాంధ్రకు ఏం చేశారో చెప్పండి

కళాకు మాజీ ఎమ్‌పి బెల్లాన సవాల్

ప్రజాశక్తి - చీపురుపల్లి

టిడిపి హయాంలో ఉత్తరాంధ్రకు మీరు ఏం చేసారో చెప్పాలని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును ప్రశ్నించారు. సోమవారం ఆయన నివాశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లాన మాట్లాడారు. మాజీ మంత్రి, వైసిపి శాసన మండలి ప్రతిపక్ష నాయకుడైన బొత్స సత్యన్నారాయణను ఉత్తరాంధ్ర ద్రోహిగా కళావెంకటరావు అభివర్ణిండం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్ల పాటు మంత్రిగాను, ఎమ్మెల్యేగా పని చేసిన కళావెంకటరావు గానీ, ఆయన తమ్ముడు గానీ ఉత్తరాంధ్రకు గాని, శ్రీకాకుళం జిల్లాకు గానీ ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. సంకిలి నుండి చీపురుపల్లి నియోజకవర్గానికి తాగు నీటితో పాటు తోటపల్లి ద్వారా సాగు నీరు తీసుకు వచ్చిన ఘనత బొత్స సత్యన్నారాయణదేనని గుర్తు చేశారు. సొంత నియోజకవర్గం రాజాంకి సంకిలి నుండి కనీసం తాగడానికి గుక్కెడు నీరైనా కళావెంకటరావు తీసుకు వచ్చారా అని ప్రశ్నించారు. ఎచ్చెర్లలో గెలవలేక చీపురుపల్లి టిక్కెట్టు కళావెంకటరావుకి ఇచ్చారని అదృష్టవ సాత్తు గెలిచారే తప్ప ఇక్కడేమీ ప్రజలకు సేవ చేసింది లేదని అన్నారు. అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ చీపురుపల్లి నియోజకవర్గానికి ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. గెలిచిన తరువాత ఏదో గెస్ట్‌లాగా చీపురుపల్లి వచ్చి మీ కొడుకు పుట్టిన రోజులు, మీ పుట్టిన రోజులు జరుపుకుంటున్నారే తప్ప చీపురుపల్లి ప్రజల కష్టసుఖాలు ఏనాడైనా పట్టించుకున్నారా అని అన్నారు. పదవుల కోసం కాపునాయకుడిన అని చెప్పి మంచి పరిపాలనా దక్షత ఉన్న బొత్స సత్యన్నారాయణను కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. గత ఐదేళ్ల పాటు చీపురుపల్లి నియోజకవర్గానికి ఎటువంటి అభివృద్ధి చేసామో ప్రజల మధ్యనే చర్చించుకుందాం రావాలని సవాల్ విసిరారు.